## శివయ్యసేవలో వివిఎస్ లక్ష్మణ్

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం ప్రముఖ క్రికెటర్ వివియన్‌లక్ష్మణ్ కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. వారికి ఆలయమర్యాదలతో దక్షిణగోపురం వద్ద ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్,ఎఇఓ సతీష్‌మాలిక్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్‌లు పర్యవేక్షించారు. కాగా ఆలయంలో నిర్వహించే రుద్రాభిషేకాలను జరిపించుకోవాలని కోరగా ఏర్పాట్లు చేసారు. తరువాత అతిధిగృహంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికలసి నియోజకవర్గ అభివృద్ధి గురించి వివరించారు.అలాగే లక్ష్మణ్‌ను వెంకటేశ్వరస్వామి చిత్రపటాల్ని అందించారు. ఆయనతోపాటు బోర్డు సభ్యులు మున్నారాయల్, బుల్లెట్ జయశ్యాం ఉన్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## లగేజీ వాహనాన్ని ఢీకొన్న కంటైనర్

-తప్పిన పెనుప్రమాదం

పల్టీ కొట్టిన బొలేరో లగేజీ ఆటో : ప్రమాదానికి కారణమైన లారీ

నారాయణవనం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : పుత్తూరు-చెన్నై జాతీయ రహదారిలోని నారాయణవనం మండలం సిద్దార్థ ఇంజనీరింగ్ కళాశాలకు సమీపంలోని వేదనారాయణ స్కూల్ వద్ద ఆదివారం ఉదయం 7గంటలకు ముందర వెలుతున్న బొలేరో లగేజీ ఆటోనె వెనక వైపు నుంచి కంటైనర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో స్వల్పగాయాలతో బొలేరో వాహనం డ్రైవర్ మహ్మద్ ఆలీ బయటపడ్డారు. పుత్తూరు నుంచి నారాయణవనం వైపు వస్తున్న బొలేరో వాహనాన్ని వెనుక వైపు వస్తున్న కంటైనర్ ముందర చక్రం పేలిపోవడంతో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బోలేరో పల్టీ కొట్టింది. లగేజీ ఆటో ముందర భాగంగా పూర్తిగా దెబ్బతిన్నది. లారీ ముందర భాగం కూడా నుజ్జు అయ్యింది. వెంటనే లారీ డ్రైవర్ పోలీసులకు సరెండర్ అయిపోయాడు. గాయపడ్డ మహ్మద్ ఆలీ పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరకట్న వేధింపులతో

## వివాహిత ఆత్మహత్య

-మృతురాలు చేమూరు గ్రామ వాలంటీరు -పోలీసులు కేసునమోదు

మృతిచెందిన సుమలత(ఫైల్‌ఫోటో)

తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త మండలంలోని దయనేడు గ్రామంలో ఓ వివాహిత వరకట్న వేధింపులకు బలైంది. మారుతున్న సమాజంలో ఇంకా అత్తామామలు, ఆడబిడ్డల్లో మార్పురావడం లేదు. వరకట్న వేధింపులతో ఓ వాలంటీర్ ఆత్మహత్య చేసుకుందని తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. మృతురాలి తల్లి పిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దయనేడు గ్రామానికి చెందిన రాగిపాటి వెంకటమ్మ, భర్త రాగిపాటి అంకయ్య కుమార్తె బాపన సుమలత అలియాస్ నిర్మల(26)ను చేమూరు గ్రామానికి చెందిన బాపన నల్లయ్య కుమారుడు బాపన విజయశేఖర్‌తో ఆరు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి నీహారిక(4) కుమార్తె ఉంది. వివాహం అయిన ఏడాది వరకు అమ్మాయిని బాగా చూసుకునేవాడని రెండో సంవత్సరం నుంచి వరకట్న వేధింపులకు గురిచేసి పలుమార్లు కొట్టి హింసించడం చేసేవాడని తెలిపింది. తన కుమార్తె చేమూరు గ్రామ వాలంటీరుగా పనిచేస్తూ ఉంటుందని పిర్యాదులో పేర్కొంది. భర్త విజయశేఖర్ తన కుమార్తెను చిత్రహింసలు పెట్టేవాడని భరించలేక తన కుమార్తె, బిడ్డతో సహా పలుమార్లు ఇంటికి వస్తుండేదని అయితే గ్రామంలోని కొందరు పెద్దల సమక్షంలో గ్రామంలో వాలంటీరుగా పలు పనులు పెండింగ్‌లో ఉన్నాయని ఇకపై వేధించను, హింసించనని మాయమాటలు చెప్పి నమ్మించి తిరిగి కాపురానికి స్వగ్రామం దయనేడు గ్రామానికి తీసుకువచ్చాడన్నారు. అంతేకాకుండా ఇదే గ్రామంలో మరో మహిళతో అక్రమసంబంధం పెట్టుకుని తన కుమార్తెను తరచు హింసించడం, అక్రమసంబంధం ఉన్న మహిళతో సహజీవనం చేస్తానని బెదిరించడం మరియు తీవ్రంగా కొట్టేవాడని తల్లి పిర్యాదులోపేర్కొంది.ఈనేపథ్యంలో ఈనెల 15వతేదీ రాత్రి 8.20గంటలకు చేమూరు గ్రామానికి చెందిన ఓమహిళ ఫోన్ ద్వారా తన బిడ్డకు సీరియస్‌గా ఉందని పట్టణంలోని ఓప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం తీసుకెళ్తున్నామని సమాచారం అందించారని దీంతో తాము హుటాహుటిన ఆస్పత్రికి వెళ్ళగా అప్పటికే మృతిచెందగా చేమూరు గ్రామానికి తీసుకుని వెళ్ళారని తెలపగా తాము వెంటే అక్కడకి చేరుకుని చూడగా తన కుమార్తె శవమై ఉందని తల్లి రోధించింది. తన కుమార్తెను తరచూ డబ్బులకోసం, అదనపు కట్నం కోసం హింసించేవాడని ఆతని వేధింపులకుతాళలేక తన కుమార్తె ఉరివేసుకుని ఉండగా భర్త చూసి కొందరి వ్యక్తులతో హాస్పిటల్‌కు తీసుకుని వెళ్ళారని అక్కడకు వెళ్ళిన తర్వాత మృతిచెందిందని నిర్ధారించారని అందువల్ల ఇంటికి చేరుకున్నామని పిర్యాదులోపేర్కొన్నారు. అయితే తన కుమార్తె మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని భర్త , కుటుంబసభ్యులు కొట్టిచంపివేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆవేదనవ్యక్తం చేసింది. తన కుమార్తె మృతికి కారణమైన విజయకుమార్‌పై తగిన చర్యలుతీసుకుని న్యాయం చేయాలని పిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసునమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు.

## డిప్యుటీ సిఎంతో పాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు కష్టకాలం!

- ప్రజలతో మరింత మమేకం కాకుంటే టిక్కెట్లు గల్లంతే - మరింత పుంజుకొని గ్రీన్ జోన్ పరిధిలోకి వస్తే సరి



చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికారం సాధించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న వైకాపా అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి చిత్తూరు ఉమ్మడి జిల్లా పరిధిలో ఆ పార్టీకి చెందిన నలుగురు ఎమ్మెల్యేల పనితీరు కలచివేస్తోంది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం మినహా మిగిలిన 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసి తన ఖాతాలో వేసుకొంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ప్రారంభించారు. ప్రతి లబ్దిదారుడికి నేరుగా డిబిటి విధానంలో ఆర్థిక లబ్ది జరిగేలా చర్యలు తీసుకొంటున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు పూర్తి కావడం, క్షేత్ర స్థాయిలో అన్ని వర్గాల ప్రజానీకానికి సంక్షేమ పథకాలు అందిస్తుండటంతో 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మొత్తం అసెంబ్లీ స్థానాలను మరోసారి క్లీన్ స్వీప్ చేయాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంకణం కట్టుకొన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ళు పూర్తి కావడం, అధికారం చేపట్టినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలకు ఎదో ఒక పథకం పేరిట సంక్షేమ పథకం అందుతుండటంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లోకి మరింత చొచ్చుకొని వెళ్ళి సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించాలని, అర్హులైన లబ్దిదారులు ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుంటే వారితో పథకాల కోసం దరఖాస్తు చేయించి అధికారుల ద్వారా పథకాలు మంజూరు చేయించాలని ఆదేశించారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్ళడం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం రూపొందించారు. ఈ కార్యక్రమం గత ఆరు నెలలుగా జరుగుతోంది. మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎప్పుడు సమయం వుంటే ఆ సమయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు, గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించి ప్రతి ఒక ఇంటికి వెళ్ళి ఇంట్లోని వారితో మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా! లేదా! అని అరా తీయడంతో పాటు ఒక వేళ అర్హులుగా వుండి పథకాలు అందకుంటే జరిగిన పొరబాటును గుర్తించి వారితో మరోసారి పథకాల కోసం దరఖాస్తు చేయించి అధికారులతో పరిశీలించి వారికి మంత్రులు, ఎమ్మెల్యేలు పథకాలు మంజూరు చేయించాల్సి వుంటుంది. ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో వైకాపా ఇన్‌ఛార్జీ భరత్‌తో పాటు మరో నలుగురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమం అమలులో గ్రీన్ జోన్‌లో వుండగా మరో ఐదు మంది ఎమ్మెల్యేలు ఆరెంజ్ జోన్‌లో వున్నారు. అయితే జిడినెల్లూరు నియోజకవర్గం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రూరెడ్డి, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంలు మాత్రం గడప గడపకు మన ప్రభుత్వం అమలులో వెనుకబడి వున్నట్లు ప్రభుత్వానికి నివేదికలు వెళ్ళాయి. ఇప్పటికే డిప్యుటీ సిఎం నారాయణస్వామితో పాటు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వారి నియోజకవర్గాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను విస్తృతంగా చేపడుతున్నారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రూరెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలంలు సైతం వారి పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వంకు క్షేత్ర స్థాయి నుండి వెళ్ళిన నివేదిక మేరకు ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆశించిన స్థాయిలో జరుగుడం లేదని ఈ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రజలతో మరింత మమేకమై వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాల్సి వుంటుంది. ప్రస్తుతానికి జిల్లాలో 14 నియోజకవర్గాల పరిధిలో 10 నియోజకవర్గాలు గ్రీన్, ఆరెంజ్ జోన్‌లో వుండగా నాలుగు నియోజకవర్గాలు మాత్రమే రెడ్ జోన్‌లో వెళ్ళినట్లు ప్రభుత్వానికి నివేదికలు వెళ్ళాయి. అయితే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసే నాటికి ప్రభుత్వానికి వెళ్ళే నివేదికల్లో మార్పులు జరిగే అవకాశం వుంటుంది. ప్రస్తుతం రెడ్ జోన్ పరిధిలో వున్న డిప్యుటీ సిఎం నారాయణస్వామి, మరో ముగ్గురు ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాల పరిధిలో జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని ప్రజలతో మరింత మమేకమై వారి సమస్యలను పరిష్కరించడానికి మరింత చొరవ తీసుకొంటే వీరు సైతం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అమలులో సేఫ్ జోన్‌కు చేరే అవకాశం వుంది.

## శివయ్య సేవలో ఒకటే జనం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తులు కిట కిట లాడారు. వేసవికాలం మండుటెండల్లో అయినా లెక్కచేయక భక్తులు కడలి తరంగాల్లా కదలివచ్చారు.ఆదివారంసుమారు 30వేల మంది భక్తులు దర్శనానికి వచ్చారు.వచ్చిన భక్తులు అతిధులకు ఎలాంటిఇబ్బంది లేకుండా దేవస్థానం సిబ్బంది ఏర్పాట్లు చేసారు. ఎసి మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ సతీష్‌మాలిక్‌లు,టెంపుల్ ఇన్స్పెక్టర్లు హరియాదవ్,సుదర్శనంనాయుడు,నాగభూషణం వారి సిబ్బంది చర్యలు తీసుకున్నారు.కాగా అతిధుల తాకిడి ఒకూడా గణనీయంగా ఉంది.అధికారులు అందించినసమా చారంమేరకు రాహుకేతుదోష నివారణ పూజలు సుమారు ఐదువేలు జరిగినట్లు వివరించారు.రూ.500ల టిక్కెట్లుకొనుగోలు చేసి పూజలు జరుపుకున్నవారు 2960, రూ.750లటిక్కెట్లు 1245,రూ.1500టిక్కెట్లు 287,రూ.2500 టిక్కెట్లుతో 276, రూ.5వేల టిక్కెట్లుకొనుగోలు చేసినవారు 65 కొనుగోలు చేసి పూజలు జరిపించుకున్నారు. అభిషేకాలు 99 జరిగినట్లు అలాగే మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు 32 గోపూజలు 91 చండీహోమాలు 6 రుద్రహోమాలు 2 దీపారాధన 22అర్చనలు 172,శనీశ్వరాభిషేకాలు 5 జరిగినట్లు వివరించారు.

పోలీస్ శాఖచే ముస్లిం సోదరులకు

## ఇఫ్తార్ విందు

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి, ముస్లీం సోదరులు

తిరుపతి క్రైం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

రంజాన్ మాసం పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీస్ శాఖచే ముస్లిం సోదరులకు, నగరంలోని ముస్లిం పెద్దలకు తిరుపతి ఎస్పి పరమేశ్వర రెడ్డి ఆదివారం పోలీస్ పెరేడ్ మైదానంలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లీం సోద రులకు ముందుగా శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్ధనలు, కఠిన రోజా ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూమన కరుణాకర్ మాట్లాడుతూ మంచి సంప్రదాయానికి శ్రీకారం చుట్టిన ఎస్పి పరమేశ్వర రెడ్డిని అభినందించారు. హిందూ ముస్లింలు అన్నదమ్ములుగా కలసి మెలసి ఉంటూరు కనుక తిరుపతి ప్రత్యేకత సంతరించుకుందన్నారు. ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, తిరుపతి మేయర్ డా. శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్ రెడ్డి, అడిషనల్ ఎస్పిలు వెంకటరావు అడ్మిన్, విమలకుమారి క్రైం, కులశేఖర్ ఎల్‌అండ్‌ఓ మునిరామయ్య తిరుమల సెబ్, రాజేంద్ర, జిల్లాలోని డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మాటపై నిలబడే నాయకుడు జగనన్న

మంత్రి రోజా

నగరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త: మాటపై నిలబడే నాయకుడు జగనన్న అంటూ మంత్రి రోజా అన్నారు. మున్సిపాలిటీ 8వ వార్డలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ప్రతి ఇంటికి వెళ్లి నివాసితులను ఆప్యాయంగా పలకరించారు. వారికి ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమాన్ని అంకెలతోసహా వివరిస్తూ బుక్‌లెట్‌ను అందజేశారు. నివాసితులు ఆమెను హారతులు పట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలోపాలించిన పాలకులకు విరుద్ధంగా తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజు నుంచే ప్రభుత్వానికి ప్రజలంతా సమానమని, అందరికిన్యాయం చేయాలని చెబుతూ ఆదర్శవంతమైన రాజకీయాలకు తెర తీశారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.జి.నీలమేఘం, వైస్‌చైర్మన్ బాలన్, కౌన్సిలర్ అణ్ణెమ్మ, దయానిధి, నాయకులు యాకోబు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి, పాకాల, భాకరాపేటలో

## 'రాయలవారి కాంస్య' విగ్రహాలు

నియోజకవర్గ మండల కేంద్రాలలో "అంబేద్కర్ కాంస్య" విగ్రహాలు

వారపు సంతలో పేదలకు అన్నదానం ఎంఎల్ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

చంద్రగిరికి చారిత్రాత్మక నేపథ్యం తీసుకువచ్చిన శ్రీకృష్ణ దేవరాయలు వారి కాంస్య విగ్రహాలను చంద్రగిరి, పాకాల, భాకరాపేటలో ప్రతిష్టించతలపెట్టినట్లు ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలి పారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం వారపు సంతను పురస్కరించుకుని ఆయన రైతులకు, వినియోగదారులకు, మధ్యాహ్న భోజనం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రాయలవారి కాంస్య విగ్రహాల తయారీ ఆర్డర్ ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కాంస్యవిగ్రహాలను నియోజకవర్గంలోని 6 మండల కేంద్రాలలో ప్రతిష్టించనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు ఇప్పటికే విగ్రహాల తయారీ జరుగుతున్నట్లు తెలిపారు. ఎంఎల్ఏ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించిన అన్నదాన కార్యక్రమం సాయంత్రం కొనసాగింది. వారపు సంతలో గేటు రుసుము చెల్లించేందుకు ఇబ్బందులు పడుతున్న చిన్న, సన్నకారు రైతులు, చిరు వ్యాపారుల సౌకర్యార్థం ఆ మొత్తాన్ని ఏడాదికి సరిపడా ముందుగానే చెల్లించడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తూ గజమాలలతో ఘన సన్మానం చేసి ధన్యవాదాలు తెలిపారు. అన్నదాన కార్యక్రమం ఇకపై ప్రతి ఆదివారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్న కాణిపాకం ఆలయం

## సమస్యలపై "సమరం" ఏదీ!?

-తెలుగుతమ్ముళ్ళ పనితీరులో రాని మార్పు

ప్రభాతవార్త-తిరుపతి: ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిచే వారికే టిక్కెట్లు ఇవ్వడం జరుగుతుందని...ప్రజాభిప్రాయం మేరకు స్థానికంగా పార్టీకి గట్టిగా పనిచేసే నాయకులకు అభ్యర్థులుగా అవకాశం ఇస్తానని రాజకీయచాణుక్యుడు....వ్యూహకర్త,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఆదేశాలను ,సూచనల మేరకు పనిచేసే నాయకులను వ్రేళ్ళపై లెక్కపెట్టవచ్చనేది కార్యకర్తల్లో, అభిమానుల్లో చర్చలేకపోలేదు. ఇప్పటికే గత నాలుగుసంవత్సరాల కాలంలో చంద్రబాబు సొంత జిల్లాలో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న నాయకులు లేరనే అసహనం ఆయన పలు సమావేశాల్లో నిర్మొహమాటగా వ్యక్తం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న కనీస సమస్యలు, మౌళిక వసతులు కల్పించకపోవడం, పెంచిన విద్యుత్‌ఛార్జీలు, రోడ్లు సరిగా లేకపోవడం, కొన్ని చోట్ల తాగునీటికి జనం ఇబ్బందులు పడుతుండటం, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు తేలేకపోవడం, విద్యార్థుల ఫీజు రీఎంబర్స్‌మెంట్ తదితర సమస్యలపై ఎక్కడికక్కడ ప్రజలతో మమేకమై కార్యక్రమాలు చేపట్టాలని బాబు ఆదేశించారు. అయితే ఉభయజిల్లాల్లో ఆ దిశగా పనిచేస్తున్న నాయకులు,ఇన్‌ఛార్జిలు లేరనే వాదన పార్టీ వర్గాల్లోనే బలంగా వినిపిస్తోంది. అడపాదడపా పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలు మొక్కుబడిగా చేయడం, పత్రికల్లో ఫోటోఫోజులతో సరిపెట్టేస్తున్నారనే నేతలకు గట్టిగా క్లాస్ ఇచ్చిన సందర్భాలు లేకపోలేదు. ఇటీవల జోన్ 4 పరిధిలో నెల్లూరులో జరిగిన పార్టీ ఇన్‌ఛార్జిలు, పార్లమెంట్ కమిటీ ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, పరిశీలకులు, సమన్వయకర్తల సమావేశంలోనూ ప్రతి నియోజకవర్గంలోనూ ఇన్‌ఛార్జిల పనితీరుపై అధినేత అసంతృప్తి చెందారు. ఈ దఫా టిక్కెట్లు ప్రజాభిప్రాయం మేరకు, ప్రజలు చెప్పిన వారికే ఇస్తానని, "ఇదేంఖర్మమన రాష్ట్రానికి, మీ ఇంటివద్దకు మీ అభ్యర్థి"నినాదంతో చేపట్టే కార్యక్రమాల్లో ప్రజలకు చేరువయ్యే విధానంపై పర్యవేక్షణ ఉంటుందని గట్టిగా చెప్పారు. నాయకులుగా తిరగడం కాదని...స్థానికంగా ప్రజలసమస్యలపై పోరాటం చేయాలని ,ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి కనీసం మద్దతుగా నిలవాలని సూచించారు. ఆ తరువాతే టిక్కెట్లు ఖరారుచేస్తానని తెగేసి చెప్పడంతో నేతలు ఉనికిని చాటుకునే దిశగా పరుగులుతీస్తున్నారు. తిరుపతి నియోజకవర్గం టిడిపికి మంచి పట్టుఉన్న చోట కూడా పార్టీని కాపాడులేకపోతున్నారని, ప్రజల సమస్యలపై పోరాటం చేయడంలేదనే అసహనాన్ని బాబు వ్యక్తం చేశారంటే నేతల పనితీరు ఏ పాటిదో అర్థమవుతుంది. ఇక్కడ జనం పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటిపై పోరాటం చేయడంలేదనే హెచ్చరికలు చేశారనేది సమాచారం. ఇక చంద్రగిరి నియోజకవర్గంలో అభివృద్ధి ఏపాటి జరిగిందనే విషయంపై ప్రజలకు వివరించలేకపోతున్నారనేది స్వయంగా బాబు చెప్పడం కొసమెరుపు. అధికారపార్టీ ఎమ్మెల్యేలు,నేతల తీరుపై గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్ళలేకపోతున్నారని అధినేత అసహనం. ఇక చిత్తూరు, పూతలపట్టు, జిడినెల్లూరు నియోజకవర్గాల్లో పార్టీని నడిపించే నేతలు దిక్కులేరు,పార్టీ పదవులు, అధికారంలో ఉన్నపుడు ఎమ్మెల్సీలు అనుభవించిన నేతలు కూడా సమస్యలపై పోరాటం చేయడంలేదనేది బాబు వాదన. పలమనేరు,శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు,వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట ప్రాంతాల్లో నేతల పనితీరు అంతంతమాత్రంగానే ఉందనేది సమాచారం.

## సాంఘిక దురాచారాల నిర్మూలనకు కృషిచేద్దాం

-పి.తులసినాథం నాయుడు.

పలమనేరు ఏప్రిల్ 16 ప్రభాతవార్త : కందుకూరి వీరేశలింగం పంతులును ఆదర్శంగా తీసుకుని సాంఘిక దురాచారాల నిర్మూలనకు, మూడనమ్మకాలను తొలగించడానికి చదువుకున్నవారంతా కృషి చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు పేర్కొన్నారు. ఆదివారం కళామందిరంలోని కందుకూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రచనల ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన సంఘ సంస్కర్త కందుకూరి అన్నారు. కేవలం రచనల ద్వారా చెప్పడమేకాక తాను స్వయంగా సంఘ సంస్కరణలకు పూనుకొని తనను తాను అర్పించుకున్న కార్యదక్షుడు కందుకూరి అన్నారు, దురదృష్ట వశాత్తు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన నేటికాలంలో అనేక మూడ నమ్మకాలు కొనసాగడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పుష్ప, శివశంకర్ రెడ్డి, యల్ల ంపల్లి నరేంద్ర, గిరిధరమూర్తి, సుదర్శనాచారి, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్,పిఇఎస్ ఆస్పత్రిచే ఉచిత వైద్యశిబిరం

పెద్దపంజాణి ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

మండలంలోని రాయలపేట ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో ఆదివారం పలమనేరు లయన్స్‌క్లబ్ వారి సహకారంతో కుప్పం పిఇఎస్ వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిం చారు. సుమారు300 మందిందికి పిఇఎస్ ఆసుపత్రి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా బిపి,చెక్కర, అపెం డిక్స్,గుండె సమస్య లు,థైరాయిడ్ తదితర వ్యాదులకు సంబందించి వైద్య పరిక్షలు నిర్వహించారు.వైద్య పరీక్షలు నిర్వహించుకున్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహణ కల్పించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ పి.రవి,కార్యదర్శి మధుసూధన్ రెడ్డి,పుగలేంది తదితరులు పాల్గొన్నారు.

## గడప గడప కార్యక్రమం విజయవంతం చేయాలి

: వైసీపీ మండల పార్టీ అధ్యక్షులు పద్మనాభరెడ్డి

వెదురుకుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త : మండలంలోని పాతగుంట సచివాలయం పరిధిలో సోమవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు, మండల స్థాయి అధికారులు. సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నాలని చెప్పారు. కార్యక్రమంకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారని విధిగా అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

గుడిపాల, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తోందని ఎంపిపి ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పెరుమాళ్ళకుప్పం గ్రామంలో ఆదివారం గ్రామ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఎంపిపి ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలతోనే మానసిక ఉల్లాసం వస్తోందని, క్రీడల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో క్రీడల ప్రోత్సాహానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. ఈ పోటీల్లో గెలిచి మొదటి స్థానం నిలిచిన ఉసురు గ్రామ క్రీడాకారులకు ఆయన 20 వేల రూపాయలు, రెండవ స్థానంలో నిచిలిన పాతూరు గ్రామ క్రీడాకారులకు 15 వేల రూపాయలు బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ సాయి, మాజీ సర్పంచ్ రవీంద్రారెడ్డి, మండి కృష్ణాపురం యూత్ తదితరులు పాల్గొన్నారు.

## అందరికీ ఆరాధ్యదైవం బీఆర్ అంబేద్కర్ : జెఇ సుమంత్

గంగవరం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :

నవ భారత నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందరికీ ఆరాధ్య దైవమని గంగవరం అంబేద్కర్ యువజన సేవా సంఘం సలహాదారుడు జయరామ్ ఈశ్వరీ సుమంత్ అలియాస్ నాని పేర్కొన్నా రు.విశ్వ మానవమూర్తి డా.బాబాసాహేబ్ అంబేద్కర్ 132వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని తాళ్ళపల్లె పంచాయతీ తమ్మిరెడ్డిపల్లె గ్రామంలో గ్రామానికి చెందిన యువకులు,పిల్లలు,మహిళలు ఎంతో ఉత్సాహంతో అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డా.బీఆర్ అంబేద్కర్ కులానికో మతానికో చెందిన వ్యక్తి కాదని,అన్ని వర్గాల ప్రజల ఆరాధ్యదైవమని ఆయన తెలిపారు. ఆదర్శప్రాయుడు అంబేద్కర్ జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.అనంతరం సభ్యులు వినోద్‌కుమార్,గంగవరం బద్రి,భాస్కర్, పరమశివలు మాట్లాడుతూ అంటరానితనం,కుల నిర్మూలనే లక్ష్యంగా అనేక ఉద్యమాలు చేసి ఎందరికో ఆదర్శంగా నిచిచారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు ,సుధాకర్‌రెడ్డి,రెడ్డిమహేష్, పవన్‌కుమార్,రెడ్డిప్రకాష్, గోపి,కిరణ్‌కుమార్,రెడ్డిప్రసాద్, బోయకొండ,ఆంజి, నవీన్‌కుమార్,సుబ్రమణ్యం,గుర్రప్ప,వెంకటాద్రి,లక్ష్మీనారాయణ,గోవిందప్ప,లక్ష్మయ్య,బాబుపాల్గొన్నారు.

## గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

– మండల కన్వీనర్ బాగారెడ్డి

పెద్దపంజాణి ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

ప్రజాసమస్యలను క్షేత్రస్థాయిలో అడిగి తెలుసుకుని పరిష్కారించే దిశగా సిఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పెద్దపంజాణి మండలంలో మంగళవారం పలమనేరు ఎమ్మెల్యే డా॥ ఎన్.వెంకటేగౌడ గడప గడ పకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైకాపా మండల కన్వీనర్ బాగారెడ్డి తెలిపారు. మండ లంలోని తుర్లపల్లి గ్రామ పంచాయతీలో వున్న తుర్లపల్లి,టి.కొత్తూరు, గుమ్మరాజు పల్లి,మల్లసముద్రం,నగిరేపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రతి గడప తిరిగి ప్రజలసమస్యలను అడిగి తెలుసుకుని తక్షణమే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.ఇదివరకే మండలంలో పలు పంచాయతీల్లో జరిగిన గడపగడపకు కార్యక్రమానికి ప్రజలనుంచి మంచి స్పందన లభిస్తుంద న్నారు.నాలుగేఏళ్ళ పాలనలో సిఎం జగన్మోహన్ రెడ్డి 98.5శాతంకుపైగా హామీలు అమలుచేసి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు.ప్రజలు వైకాపా పాలన పట్ల సంతృప్తిగా వున్నారని పేర్కొ న్నారు. వైకాపా రాష్ట్ర,జిల్లా,నియోజకవర్గ,మండల, పంచాయతీ,వార్డు, కన్వీనర్లు, గృహసారథులు, నాయకు లు,కార్యకర్తలు,అభిమానులు,ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత మెగా వైద్య శిబిరం

– చంద్రబాబు కార్యదర్శి మనోహర్

కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తెదేపా అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా ఈనెల 20వతేది గుడుపల్లె శ్రీ రాళ్ల గంగమ్మ ఆలయం వద్ద ఎన్టీఆర్ ట్రస్ట్‌చే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చంద్రబాబు కార్యదర్శి మనోహర్ తెలిపారు. కుప్పం కెసి హాస్పిటల్ వైద్య బృందంచే బిపి, షుగర్,పక్షవాతం, గుండెసమస్యలు, థైరాయిడ్, కడుపునొప్పి, సంతాన సాఫల్య కొరకు చికిత్సతో పాటు స్త్రీ సంబంధిత వ్యాధులు, ఎముకలు తదితరాలకు ఉచిత వైద్య సేవలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరంకు హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు నకలు, ఫోన్ నెంబరుతో హాజరు కావాలని వివరాలకు 8090905900నెంబరును సంప్రదించాలని కోరారు.

## సంక్షేమ పథకాల అమలు సిఎం జగనన్నతోనే సాధ్యం

కుప్పంరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు సిఎం జగనన్నతోనే సాధ్యమవుతుందని కుప్పం మున్సిపల్ 24వ వార్డు కౌన్సిలర్ సయ్యద్ అలీ పేర్కొన్నారు. ఆదివారం విజయలక్ష్మిరోడ్, సున్నపురాళ్లవీధి, మునస్వామిపురం ప్రాంతాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే సిఎం జగనన్న లక్ష్యమన్నారు. నాలుగేళ్లలో 2లక్షల కోట్లు పేదలకు పథకాల రూపంలో నేరుగా అందించారన్నారు. అలాంటి సిఎం జగనన్నను ప్రజలు మరోమారు ఆదరించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ అలీంబాషా పాల్గొన్నారు.

## డికెపల్లిలో అగ్నిప్రమాదాలపై అవగాహన

**కుప్పంరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త** అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మున్సిపల్ పరిధి డికెపల్లిలో కుప్పం ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ అధ్వర్యంలో ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్, కృష్ణయ్య, బాలకృష్ణ, లక్ష్మీనారాయణ, సతీష్‌కుమార్, రామూర్తి, రఘుపతి పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్ అడుగులు

– ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా రని ఈ పథకాలను సద్వినియోగం చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరు ఆర్థికంగా ముందడుగు వేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41వ డివిజన్ పరిధిలోని తోటపాళ్యం శివాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పూజలు నిర్వహించి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలకు అర్హులై వుండి ఎవరికైనా పథకాలు అందకుంటే వారు మళ్ళీ దరఖాస్తు చేసుకొంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువ, విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను ప్రస్తావించారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే సత్వరం పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కార్పొరేటర్ కుప్పమ్మ, చుడా ఛైర్మన్ పురుషోత్తంరెడ్డి, కార్పొరేటర్ జ్ఞానజగదీష్, వైకాపా నాయకులు సీతాపతి, చంద్రశేఖర్, మనోహర్‌రెడ్డి, ధరణి, రమేష్, హరి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## డా.బి.ఆర్.అంబేద్కర్ అవార్డు అందుకున్న శ్రీరంగపల్లె మునస్వామి

చిత్తూరురూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

షెడ్యూల్డ్‌కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం చేపట్టిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఆల్ ఇండియా ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీరంగపల్లె మునస్వామి భారతరత్న, రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్ అవార్డు, మెమోంటోను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, నగర మేయర్ చేతుల మీదుగా అందుకొన్నారు. ఈ సందర్భంగా మునస్వామి మాట్లాడుతూ ఈ అవార్డు స్ఫూర్తితో భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ కులాల అభ్యున్నతికి మరిన్ని సేవా చేపడుతానని,అలాగేజిల్లాసాంఘీకసంక్షేమశాఖ డిడి శ్రీమతి రాజ్యలక్ష్మీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గంగమ్మ సేవలో ఎమ్మెల్సీ భరత్

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ ఆయన సతీమణి దుర్గాపద్మినీలు దర్శించుకొన్నారు. మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్రమౌళిలు వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో పండితులచే వేదాశీర్వాదం, గంగమ్మ పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. ఆలయ అధికార, అర్చక, సిబ్బంది సేవలందించగా, పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## రూ. 83లక్షలతో షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

బోయకొండ(చౌడేపల్లి), ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. ఈక్రమంలో కొండ కింద భక్తుల సౌకర్యార్థం రూ. 83లక్షలతో అతిపెద్ద షెడ్డు (చిన భోగం, పెద్దభోగం కటింగ్ కేంద్రాలు)ను నిర్మాణం చేపట్టనన్నారు.ధర్మవరం పరిశీలకుడు పెద్దిరెడ్డి, మిద్దింటి శంకరనారాయణ, ఇఓ చంద్ర మౌళిలు ఆదివారం భూమిపూజ చేసి నిర్మాణాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బోయకొండపై వచ్చే 50యేళ్ళ అభివృద్ధిని చేసి చూపిస్తామని ఈ సందర్భంగా పెద్దిరెడ్డి అన్నారు. రాష్ట్ర ఏకిల కార్పోరేషన్ సభ్యుడు లడ్డు రమణ, డిష్ సూరి, ఆలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**బంగారుపాళ్యం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం వున్న ముస్లిం సోదరులకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందును బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, ఉప సర్పంచ్ కామరాజులు అందజేశారు. బంగారుపాళ్యంలోని జమియా మసీదు, ఇందిరమ్మ కాలనీ, తగ్గువారిపల్లి, జెండామాను వీధిల్లోని మసీదుల్లో ఉపవాసం వున్న మసీదుల్లో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షమీజాన్, లాలు, షంషీర్, సర్ధార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## నవరత్నాలతో అన్ని వర్గాలకు ప్రయోజనం

– వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి

నాయుడుపేట రూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరిందని వైసీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమణారెడ్డి అన్నారు. ఆదివారం నాయుడుపేట మండలం కోనేటి రాజుపాలెం గ్రామంలో ఆయన స్థానిక వైసీపీ నాయకులతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రతి గడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేస్తూ బుక్‌లెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్ కట్టా భవానిశంకర్‌రెడ్డి,ముప్పాళ్లరవీంద్రరాజు,కొండూరు పరంధామరాజు, మల్లికార్జునరాజు, వైసీపీ నాయకులు రాజశేఖర్‌రాజు,అల్లెయ్య, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

కోట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదాల్లో రక్తం అందక ఎందరో కళ్లెదుటే మరణిస్తుంటారని, అలాంటి వారి ప్రాణాలు కాపాడాలంటే ప్రతి ఒక్కరు రక్తదానం చేయాల్సిన అవసరం ఉందని కోటమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోటలోని కోటమ్మ ఆలయ ప్రాంగణంలో శ్రీ షిరిడీ అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని వైసీపీ నాయకులుయరటపల్లిమధుసూదన్‌రెడ్డి,పుచ్చలపల్లిమాజీజలసంఘంఅధ్యక్షులుదువ్వూరు వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతానికి చెందిన దువ్వూరు శ్రీనివాసులురెడ్డి ఇప్పటికి 50సార్లు రక్తదానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. సంపూర్ణ ఆరోగ్యవంతులు ఏడాదికి మూడుసార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. బీపీ, షుగర్ ఉన్న వారు కూడా రక్తదానం చేస్తే వారిలోని కణాలు ఉత్తేజితమవుతాయని చెప్పారు. నెల్లూరు రెడ్‌క్రాస్ వైద్య సిబ్బంది రక్తం సేకరించారు.షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఛైర్మన్ అల్లం రమణయ్య, కమిటీసభ్యులుఆవులసుబ్బయ్య,పెళ్లూరుకోటేశ్వరరెడ్డి,డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

## ముగిసిన బ్రహ్మోత్సవాలు

కోట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

కోట మండలం గూడలిలో సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5 నుంచి ప్రారంభమై 16వ తేదీ వరకు జరిగాయి.అయితే గత కొన్నేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలకు భక్తులు రావడం క్రమేణా తగ్గించేశారు. ఆలయ కమిటీ తగిన విధంగా ప్రచారం చేయకపోవడంతో దీనికి కారణంగా చెప్పవచ్చని గూడలి గ్రామస్థులుఅంటున్నారు.గతంలోఈ బ్రహ్మోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహించేవారని చెప్పుకొచ్చారు.

## సంజీవయ్యకు కొండూరులో అడుగడుగునా స్వాగతం

– గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాల ప్రచారం

తడ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

తడ మండలం కొండూరు గ్రామ పంచాయతీ పులివేంద్ర తదితర గ్రామాల్లో ఆదివారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అడుగ డుగునా ఆయనకు ప్రజలు ఎదురెళ్లి స్వాగతం పలికారు. గడప గడపకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి ప్రభు త్వ పథకాలను ప్రచారం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందని సంజీవయ్య ఈ సందర్భంగా అన్నారు. గ్రామానికి చెందిన తిరు మూరు రవిరెడ్డి ఆధ్వర్యంలో మహిళలు పెద్దఎత్తున మంగళహారతులు, పూలజల్లులతో ఎమ్మెల్యేని మురి పించారు. ఎంపిపి కొళవి రఘు, తహశీల్దార్ జెజె రావు, ఎంపిడిఓ అమోస్‌బాబు, వైసీపీ నాయకులు గండవరం సురేష్‌రెడ్డి, ఆర్‌కెసుందరం, శేఖర్‌రెడ్డి,మునీష్‌రెడ్డి, శేఖర్‌బాబు,వేణుగోపా ల్‌రెడ్డి, మునస్వామి రెడ్డి,వెంకటేష్‌పాల్గొన్నారు.

## ఉస్మాన్‌బాషాకు మహాత్మా జ్యోతిరావుపూలే ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం

**తడ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా తడ మండలం పాములమిట్ట ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న షేక్ ఉస్మాన్‌బాషాకు ఎక్స్‌లెన్స్ అవార్డు ప్రదానం చేశారు. సామాజిక బాధ్యతతో సేవలు చేస్తున్నందున ఈ అవార్డును తిరుపతిలో డిఇఓ డాక్టర్ శేఖర్, జస్టిస్ బి.చంద్రకుమార్‌లు అందించారు. ఉస్మాన్‌బాషా తడ, సూళ్లూరుపేట తదితర ప్రాంతాల్లో పలు స్వచ్ఛంధ సేవా కార్యక్రమాలు చేపట్టడమే కాకుండా విద్యార్థులకు వినూత్న పద్ధతులలో బోధనలు చేసి ఆయన పనిచేసే పాఠశాలల్లోనూ పచ్చదనం, పర్యావరణాలను కాపాడి గ్రామస్థులను చైతన్యవంతులను చేస్తున్న సంఘటనలను ఈ సందర్భంగా పలువురు గుర్తు చేస్తున్నారు.

## తడ బజారు సెంటర్‌లో సిపిఐ ప్రచారభేరి

తడ, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

కేంద్రంలో ప్రజావ్యతిరేక పాలన అందిస్తున్న భారతీయ జనతా పార్టీని సాగనంపాలని నినాదాలిస్తూ ఆదివారం తడలో సిపిఐ నాయకులు ప్రచారభేరి నిర్వహించారు. ఈ నెల 14 నుంచి వామపక్షాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలైందని, ఇందులో భాగంగా తడలోను కేంద్ర ప్రభుత్వానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీకి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమం చేపట్టామని సిపిఐ సూళ్లూరుపేట నియోజకవర్గం కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. ప్రచార కరపత్రాలను పంచిపెడుతూ వీరు ప్రదర్శన సాగించారు. మండల సిపిఐ నాయకులు ఓ.కుమార్, ఎ.రాజా, వెంకటేష్ నాయర్, రమేష్, సెల్వం, బాలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీచెంగాళమ్మ నిత్యాన్నదానానికి విరాళాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం రెండు లక్షల 116 రూపాయలు విరాళాలు అందాయి. గుంటూరుకు చెందిన తాళ్లూరి పూజిత ఒక లక్ష 116 రూపాయలను, చెంగాళమ్మ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు ఈపూరు వేదగిరిరెడ్డి కుమారుడు సతీష్‌బాబు లక్ష రూపాయలు విరాళాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టుబోర్డు సభ్యులు ఎంఎం పద్మజ, ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## సిఎం జగనన్నకు అండగా ఉందాం

కోట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా ఉండాలని కోట మండలాధ్యక్షులరాలు దాసరి అంజమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఊనుగుంటపాళెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు అనే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తమ నాయుడు కొడవలూరు ధనుజంయరెడ్డి ఆదేశాల మేరకు ఊనుగుంటపాళెంలో ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టడం జరిగిందిన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించే సంక్షేమ పథకాలను ఇంటింటికి తిరిగి వివరించారు. భారతదేశ చరిత్రలో ఇంతవరకు ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను నేరుగా అందజేస్తున్నారని చెప్పారు. ఎవరి సిఫార్సు లేకుండానేలబ్ధిదారుడిఇంటికిబటన్‌నొక్కిలబ్ధి చేకూరుస్తున్నారని చెప్పారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలుఆశీర్వదించాలని అంజమ్మ కోరారు. అంతకుముందు జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోతోకూడినస్టి క్కర్లను ఇళ్లకుఅంటించారు.ఆమెవెంటనాగుర్, శ్రీనివాసులు, గృహ సారథులు,వాలింటర్లు తదితరులు ఉన్నారు.

## సంక్షేమ పథకాల సృష్టికర్త సిఎం జగన్ మోహన్

వైసిపి సీనియర్ నేత గెడి వేణురెడ్డి

ఓజిలి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

రాష్ట్రంలో సంక్షేమ పథకాల సృష్టికర్త సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆయన గెలుపునకు నాంది పలుకుతాయని వైసిపి సీనియర్ నేత గెడి వేణురెడ్డి అన్నారు. కురుగొండ గ్రామంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని సచివాలయ కన్వీనర్, వాలంటీర్లు, గృహ సారథులతో కలిసి ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని లబ్ధిదారులకు వివరించారు. ఈ సందర్భంగా 

# తిరుపతి డివిజన్

## క్రీడలతోనే మానసికోల్లాసం..శారీరక దృఢత్వం..డిఎస్పీ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

క్రీడలతోనే మానసికోల్లాసం, శారీరక దృఢత్వం ఉంటుందని శ్రీకాళహస్తి డివిజన్ డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో క్రీడా ఉత్సవాల్లో భాగంగా ఇంట్రామిరల్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఎస్పీ ధర్మవరపు విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులందరు ఆరోగ్యకరంగా ఉండాలన్నా, చదవాలన్నా విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన క్రీడలు పాల్గొనాలని తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీతత్వాన్నిఅలవరచుకుని చదవాలని ఒక్క విద్యతోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలన్నారు. శ్రీకాళహస్తి క్రీడలకు నిలయం అన్నారు. పిడిలు విద్యార్థుల్లో ఉన్న క్రీడాప్రతిభను వెలికితీయాలని అందుకు తనవంతు సాయం అందిస్తామన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందించి సత్కరించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల పిడి నరసింహారావు, ఎస్ఎంసి కమిటీ ఛైర్మన్ ఆర్కాటు శంకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, బహుమతి ప్రధాత జూటూరు డిజిటల్ అధినేత రాదేశ్యామ్ మరియు పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతం

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తిలోని ఆర్‌టిసి బస్టాండు రోడ్డులో వెలసిన ప్రజ్వాల్ మెడికల్స్,ఫ్యాన్సీ సారధ్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 200 మందికి ఉచిత వైద్యపరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణి చేసారు. ఈ శిబిరాన్ని డాక్టర్ ప్రవీణ్‌కుమార్, బెంగుళూరు అపోలో ఎండి జనరల్ మెడిసిన్ డాక్టర్ దివ్య యాదవ్‌లు ప్రజలకు సలహాలు అందించారు.ఈ వవైద్యశిబిరంలోచింతావెంకి,వెంకటరత్నం,దీపిక, అజిత, వంశీ,హాజీరా,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## బ్యానర్లు చించటం,దౌర్జన్యాలుమంచి పద్ధతి కాదు

శ్రీకాళహస్తిరూరల్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాజకీయాల్లో అధికార పార్టీ తప్పిదాలను ఎత్తిచూపేది ప్రతిపక్షమే అని అయితే నేడు అధికార పక్షం వ్యవహరిస్తున్న తీరు దారుణమని ఊరందూరు దళితవాడకు చెందిన పలువురు దళిత నాయకులు వివరణ ఇచ్చారు. ఆదివారం దళితవాడకు చెందిన తెలుగుదేశం నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఊరందూరుదళితవాడలో తెలుగుదేశం నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ దళితవాడలోని కొంత మంది వైసిపి నాయకులు టిడిపిబ్యానర్‌లను చించుతున్నారని ఇది మంచి పద్ధతి కాదని మాట్లాడారన్నారు.అయితే అక్కడ దళితుల గురించి కానీ ఎవరి వ్యక్తిగతఅంశాలను గురించి విమర్శించలేదన్నారు. కొందరువైకాపా దళితులను చెప్పుకునే వారు ఎంఎల్‌ఏ మెప్పు కోసం సుధీర్‌రెడ్డినివిమర్శిస్తున్నారనిదళితవాడలో వైకాపా నాయకులు చిచ్చుపెట్టవద్దన్నారు.ఈ మేరకు బత్తెయ్య, తిరుమలకిరణ్‌కుమార్,పాండురంగయ్య,పి.రంగయ్య,డి.రంగయ్య,కుమార్‌దేశం నాయకులు పాల్గొన్నారు.

## నేడు ప్రదోషపూజలు

నాగలాపురం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

సురుటుపల్లి శ్రీపల్లికొండేశ్వరాలయంలో సోమవారం ప్రదోషకాల పూజలు జరగుతాయని ఆలయ ఛైర్మేన్ ఏవియం బాలజీ రెడ్డి పేర్కొన్నారు. సాయంత్రం 4గం॥ల నుండి 6గం॥ల వరకు ప్రదోష నందీశ్వరునికి, వాల్మీకేశ్వరస్వామి, మరగధాంబిక అమ్మవారికి ఏకకాలంలో జరుగుతాయని తెలిపారు. భక్తులు, గ్రామ ప్రజలు ప్రదోషపూజ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

## అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన

సత్యవేడు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:

అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సత్యవేడు మేజర్ పంచాయితీలోని బీసి కాలనీలో ఆదివారం ఉదయం స్థానిక అగ్నిమాపకశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన గానీ అగ్ని ప్రమాదం ఏర్పడితే గాబరా పడకుండా ఏవిధంగా వ్యవహరించి, ప్రమాదాన్ని నివారించాలో వివరించారు. ఈసంధర్భంగా అధికారులు మాట్లాడుతూ అగ్నిమాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలను నివారించే అంశంపై ప్రజల్లో అవగాహనను పెంపొందిస్తున్నట్లు తెలిపారు.

## తెలుగుదేశం వస్తేనే ధరలు తగ్గుతాయి - గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయితేనే నిత్యావసర వస్తువుల ధరలు, పన్నులు, కరెంటు చార్జీలు తగ్గుతాయని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. ఆదివారం నగరి రూరల్ మండలం బీరకుప్పం, నగరిపేట పంచాయతీలో ఇదేం కర్మ మన రాష్ట్రం కార్యక్రమంలో భాగంగాఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాల కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఒక్క ఛాన్స్‌తో అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలన పేదల పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, బీసీ నాయకులు స్టేట్ మైనారిటీ సెల్ ఖాదర్‌బాయ్, టీఎన్‌టీయూసీ జ్యోతినాయుడు, గుణశేఖర్‌నాయుడు, రొక్కం బాలాజీ, కరకంటాపురం అశోక్, ఢిల్లీ, బి.పి.ఆర్కుగం, ఎస్సీ సెల్ పార్లమెంట్ ఆర్గనైజర్స్ సెక్రటరీ అల్లిముత్తు, ఎస్సీ సెల్ సెక్రటరీ కన్నయ్య, స్టేట్ టీఎన్‌టీయూసీ బాలాజీ, నాయకులు చిట్టి, మాణిక్యం, శ్రీధర్, ఆకుల అశోక్, జ్యోతి, శంకర్, శీను, చిట్టి, మని తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద నివారణపై అవగాహన కలిగి ఉండాలి

నగరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

నగరి పట్టణంలో, నగరి పేటలో అగ్నిమాపక వారో త్సవాల్లో భాగంగా 3వ రోజు వేసవిలో అగ్ని ప్రమా దాల నివారణ చర్యల గురించి అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా నగరి, నగరిపేటలోని అగ్ని మాపక సిబ్బంది రాజు,ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున్‌లు గ్యాస్, ఎలక్ట్రిక్, ఆయిల్ ప్రమాదాలు జరిగితఏ ఎలా నివారించాలో అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రమాదాల నుంచి ఎలా తప్పించుకోవాలో చేసి చూపించారు.

## పన్నూరు - పిళాసపాలెం రోడ్డుకు మోక్షం లేదా...

విజయపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

మండలంలోని పన్నూరు - పిళాసపాలెం రోడ్డుకు మోక్ష ం లేదా అంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తొమ్మిది సంవత్సరాలుగా గుళ్లబారిన రోడ్డుపై ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మంత్రి రోజా రోడ్డు నిర్మాణానికి రూ. 2.90 కోట్లు మంజూరు చేసినా ఇంత వరకూ రోడ్డు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. వేసవిలో రోడ్డు నిర్మా ణ పనులు పూర్తి చేస్తే తమకు సౌలభ్యంగా వుంటుందని కోరుతున్నారు.

## నారాయణలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

పుత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డేవేడు కలను ఘనంగా నిర్వ హించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పుత్తూ రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లా డుతూనారాయణ పాఠశా లలో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. విద్యార్థు లంతా క్రమశిక్షణతో చదువుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న చిత్తూరు జిల్లా నారాయణ పాఠశాలల ఎజిఎం ఎం.కిషోర్ మాట్లాడుతూ ఐఐటి, నీట్ ర్యాంకులతో పాటు ఉన్నతమైన విలువలతో కూడిన చదువును నారాయణ విద్యా సంస్థలు అందిస్తున్నాయని తెలిపారు.ఆర్ఐ అనంద్‌కుమార్, సమన్వయకర్తలు దాక్షాయణి, వరలక్ష్మి, ప్రిన్సిపాల్ గోపి,వైస్ ప్రిన్సిపల్స్‌ప్రియ,సునీత,మార్కెటింగ్‌ఎజిఎంకిరణ్, ఎఒ రాజేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కల్యాణవేంకటేశ్వరుని సన్నిధిలో ప్రారంభమైన భాష్యకారుల ఉత్సవాలు

నారాయణవనం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయంలో వెలసిన భాష్యకారుల ఉత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమైనది. ఈ ఉత్సవాలు 10రోజుల పాటు జరుగుతుందని టిటిడి అధికారి నాగరాజు తెలిపారు. అంతకుముందు అమ్మవారిని ,స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం స్వామి, అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి మాడవీధుల్లో ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారు ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు.

## నగరి మున్సిపాలిటీలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో గాలి భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

నగరి మున్సిపాలిటీ 1వ వార్డు నగరిపేటలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరిలో కొండలు, గుట్టలు కొల్లగొడుతున్నారని, ప్రకృతి సంపదను దోచుకుంటున్నారని తెలిపారు. కరెంటు చార్జీలు 8 సార్లు పెంచి వేల కోట్ల భారం మోపారని, కల్తీ మద్యంతో ప్రజలు ఆరోగ్యం నాశనం చేస్తున్నారని, రాష్ట్రానికి, నగరికి పట్టిన దరిద్రం పోవాలంటే తెలుగుదేశం రావాలని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నగరి మున్సిపాలిటీ సత్రవాడలోని గణపతి ఆలయ మండలాభిషేకం కార్యక్రమంలో గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు.

## ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం

- సీపీఎం, సీపీఐ పిలుపు

నగరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

ప్రజా వ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద బీజేపీని సాగనంపుదాం, దేశాన్ని కాపాడుకుందామని ప్రజలకు సీపీఐ, సీపీఎం పిలుపునిచ్చింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మోదీ, అమిత్‌షా నాయకత్వంలో భారతదేశంలో ఉన్న దళిత మైనారిటీ వర్గాలపైన దాడులు చేస్తూ నిరంకుశమైన పరిపాలన వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా సీపీఐ, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో మోదీని గద్దెదించండి భారతదేశాన్ని కాపాడుకుందాం ఏప్రిల్ 15 నుంచి 30 తేదీ వరకు ప్రచార కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా నగరి సీపీఐ,సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ప్రచార గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ పార్టీ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు వేలన్, బాషా, పెరుమాళ్‌లు మాట్లాడుతూ ఈ రోజు కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా దళితులపై మైనారిటీలపై దాడులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే వారిపై కేసులు పెడుతూ దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. ఆంధ్ర, రాష్ట్రం విభజన చట్టంలో భోజన హామీల నెరవేర్చడంలో మొండి వైఖరి వివరిస్తూ ఆంధ్ర ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు కాని, అమరావతి రాజధాని కాని ఏక పోరాటాలు చేసి బలిదానం చేసి కొన్న విశాఖపట్నం ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తూపోరాటం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తూ ఆదానే అంబానీలు కొమ్ముకాస్తున్న బీజేపీని ఇంటికి పంపించాలని ఈ రోజు దేశ వ్యాప్తంగా ప్రచార ఉద్యమాన్ని తీసుకోవడం జరిగింది. అందులో భాగంగానే మన నగరిలో కూడా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీపీఐపట్టణకార్యదర్శి వేలన్ బాషా, కుమార్, మురళి, శేఖర్, సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి పెరుమాళ్, జగదీష్,తంగరాజు,మైలుస్వామి,నాయకులువిజయకుమార్,రాజేంద్ర,మునిరాజు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాల్మీకి బందు డాక్టర్ మురళీకృష్ణ సేవలు ఆదర్శనీయం

తిరుపతి (విద్య), ఏప్రిల్ 16, ప్రభాతవార్త

సుదీర్ఘ ఉపాధ్యాయ వృత్తిలో ఉండి జూనియర్ కాలేజ్ ప్రిన్సిపలగా రిటైర్డ్ అయిన తర్వాత గత 12 సంవత్సరాలుగా పేద బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, వాల్మీకి విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయడం ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు గ్రామ స్థాయిలో పేదవారికి అత్యవసర వస్తువులు అందించడం డాక్టర్ మురళీకృష్ణ ఆదర్శప్రాయులని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు టి. గోపాల్, సాయి నగర్ సర్పంచ్ డివి రమణలు వారి సేవలు కొనియాడారు. అదే విధంగా వాల్మీకి వివాహ సంబంధాలు ఏర్పరచి తన వంతు సహాయం చేస్తున్నారని అన్నారు. తిరుపతి శ్రీ వాల్మీకి రామాలయ ప్రాంగణంలో నిర్వహించిన రాయలసీమ వాల్మీకి వివాహ పరిచయ వేదిక తిరుమల తిరుపతి వాల్మీకి వెల్ఫేర్ సంఘం తరపున ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాయలసీమ నాలుగు జిల్లాల నుంచి వందలాది మంది వాల్మీకి సంఘం నుండి వధూవరులు వారి తల్లిదండ్రులు పాల్గొని వివాహ పరిచయవేదికను సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి వాల్మీకి సంఘం అధ్యక్షులు ఎం.కె. నాగరాజు, ప్రధాన కార్యదర్శి బండి మహేష్ కుమార్, సీనియర్ నాయకులు మాజీ అధ్యక్షులు నారాయణప్ప, ఆర్గనైజింగ్ అధ్యక్షులు జల్లి సుధాకర్ రావు, వ్యవసాయ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ పెద్దపాలెం పాపయ్య, ఇరిగేషన్ శాఖ రిటైర్డ్ డిప్యూటీ ఇంజనీర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు నరసింహులు, నాగరాజు, ఆర్టిసీ నాగేశ్వర రావు, పెన్షన్ సంఘం నాయకులు టివి రమణ, సుబ్రమణ్యం, శివమూర్తి, ప్రసాద్, బాలసుబ్రమణ్యం, ప్రముఖ న్యాయవాది నరహరి, గోవిందరాజులు, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్నను విమర్శించే అర్హత సుధీర్‌రెడ్డికి లేదు - ఎంఎస్ఆర్

రేణిగుంట, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

పేద ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధే అజెండగా పని చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని విమర్శించే అర్హత బొజ్జల సుధీర్‌రెడ్డికి లేదని వైసీపీ తారక రామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి(ఎంఎస్ఆర్) అన్నారు. రేణిగుంట తారకరామానగర్ శివాలయం ఎగువ ప్రాంతం గుట్టపై మంచి నీటి పైపులైను ఏర్పాటు చేసి ఆ ప్రాంత వాసులకు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాగునీటి కొళాయిలను ఆదివారం మన్యం శ్రీనివాసులురెడ్డి ప్రారంభించారు. మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు ఎంఎస్ఆర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్ఆర్ మాట్లాడుతూ తారకరామానగర్‌ను దత్తత తీసుకుంటానని ప్రకటించిన బొజ్జల సుధీర్‌రెడ్డి ఇంత వరకు ఆ ప్రాంత వాసులకు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కన్నయ్య, వార్డు మెంబరు సావిత్రమ్మ, తహసీన, షాహిదా, విజయలక్ష్మి, శోభారాణి, స్థానిక వైసీపీ నేతలు కృష్ణమూర్తి, ధర్మ, వెంకటయ్య, రవీంద్ర, హరి, రమేష్, మహేష్, జిలాని, కాలేషా, ఫోటో శీను, నాగాలమ్మ గుడి శీను, మధు, సూరి, భాస్కర్, కిరణ్, చైత్ర, లక్ష్మీనారా యణ, మహేష్, మహిళా నేతలు లోకేశ్వరిరెడ్డి, అమ్ములు, తులసి, సుధారాణి, లత, కవిత, జయంతి, వైసీపీ కన్వీనర్ రమణ, స్థానిక మహిళలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## శివయ్య సేవలో నీతిఅయోగ్ అధికారి

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో ఆదివారం పలువురు అధికారులు హాజరై స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో నీతిఅయోగ్ ఐఏయస్ అధికారి సంజయ్‌కుమార్ కుటుంబసభ్యులతో దర్శనానికి వచ్చారు. వారికి దక్షిణగోపురం వద్ద వారికి పిఆర్ఓ సురేష్‌రెడ్డి వేదపండితులతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శనంచేసుకున్నవారికిగురుదక్షిణామూర్తిఆలయంవద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

## అభివృద్ధే లక్ష్యంగా తెలుగుదేశంపార్టీ ముందడుగు

-ప్రజావ్యతిరేఖ విధానాలను ఎండగడుతాం..తెదేపా

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

అభివృద్ధే లక్ష్యంగా తెలుగుదేశంపార్టీ ముందడుగు వేస్తోందని వైకాపా ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేఖ విధానాను ప్రజల్లోకి తీసుకెళ్ళి ఎండగడుతామని పట్టణ తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని 23వ వార్డులోనియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు మరియ వార్డు ఇన్‌ఛార్జి మాజీ మున్సిపల్ కౌన్సిలర్ దుర్గాప్రసాద్, వినయ్, వజ్రంకిషోర్ మరియు బిజె ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ఇదేంకర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈసందర్భంగా విజయకుమార్ ప్రతి ఇంటికి వెళ్ళి ప్రజలతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో నిత్యావసర వస్తువులు, విద్యుత్ బిల్లులు, ఇసుక, ఇంటి పన్నులు ఎలా పెంచారో సమగ్రంగా వివరించారు. మూడు రాజధానులు కావాలా? ఒక్క రాజధాని కావాలా మొదలగు విషయాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత అన్ని విధాలుగా నష్టపోయామని చివరికి అర్హత ఉన్న పెన్షన్లు, రేషన్‌కార్డులు కూడా తొలగించాలని రోడ్లు కూడా అధ్వాన్నంగా ఉన్నాయని వాపోయారు. అనంతరం ఇంటింకి తిరిగి ప్రజలకు కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమంలో కంటారమేష్, చెంచయ్యనాయుడు, దశరధాచారి, ప్రకాష్‌నాయుడు, పోలూరుశ్రీనివాసులురెడ్డి, ప్రసాద్‌రావు, షాకిరాలీ, ఉమేష్‌రావు, చక్రాల.ఉష, రేణుకమ్మ, దుర్గమ్మ, కన్నల ప్రతాప్, గోపి, గోవిందు, డివి.నారాయణ, ఖాదర్‌బాషా, హేమంత్‌కుమార్, మునికృష్ణ, ప్రతాప్, మురళీ, సుధాకర్‌రెడ్డి, రామచంద్రయ్య, భాస్కర్‌గౌడ్, నారాయణగుప్తా, మణి, మునిరాజయాదవ్, సాయి, బాబురెడ్డి, బషీర్, పాండు, కృష్ణమనాయుడు, రోహిత్, సిద్దులయ్య, సురేష్‌నాయుడు, భాస్కరయ్య, విజయకుమార్, రామకృష్ణ, కుమారి, సునీమా, జయశ్రీ, ఊహ, మరియు తెలుగుదేశంపార్టీ నాయకులు కార్యకర్తలు 23వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## పేదవారి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్

ఎన్నికల వేళ స్టంట్ అవసరం లేదు.! టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి

చంద్రగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

ఏడాది పొడవునా పేదవారి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్‌కు ప్రతిరూపంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకురాలు పులివర్తి సుధారెడ్డి తెలిపారు. స్థానిక టవర్ క్లాక్ వద్ద ఆదివారం ఆమె అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను నిర్దాక్షిణ్యంగా మూసివేసిందన్నారు. ఎన్నికల కోసం సంతలు కొనుగోలు చేసి ఒక్క రోజు స్టంట్ చేసి అన్నదానాలు చేయడం కాదన్నారు. 365 రోజులు రూ.5/-లకే పేదల ఆకలితీర్చే అన్నా క్యాంటీన్ అవసరాన్ని ప్రజలకు తెలియడమే తమఉద్దేశ్యమన్నారు. ప్రజలందరూ అన్నా క్యాంటీన్ ఎంత అవసరం, టిడిపి ప్రభుత్వం ఎంత అవసరమో గుర్తించాలన్నారు. అంతకు ముందు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కర్ ధనంజయ రెడ్డి, నాయకులు ఏజి పల్లి బాల, మంగాపురం భాస్కర్, కన్నయ్యనాయుడు,మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, అమ్ములు, తపసి సత్యనారాయణ రెడ్డి, మండలం లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## మీ బంగారు భవిష్యత్తుకు పునాదుల నిర్మాణం

18 నుండి పాలిసెట్‌కు ఉచితశిక్షణ ,పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్

చంద్రగిరి, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

మీ బంగారు భవిష్యత్తుకు పటిష్ట పునాధులు నిర్మించుకునేందుకు పాలిసెట్ 2023-24 ప్రవేశానికై అందిస్తున్న ఉచిత శిక్షణా తరగతులను సద్వినియోగ చేసుకోవాలని చంద్రగిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అగరాల) ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుకుమార్ కోరారు. ఈ నెల 18 నుండి పాలిసెట్‌కు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో అర్హులైన అభ్యర్థులకు సూచించారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశం పొందడానికి ఎపిఎస్ఈబిటెట్ ఆధ్వర్యంలో పాలిసెట్-2023 ప్రవేశ పరీక్షను మే నెల 10 నిర్వహిస్తారని అన్నారు. ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థులతో పాటు ఇప్పటికే పది పాసైన వారు పాలిసెట్ వ్రాయడానికి అర్హులన్నారు. పాలిసెట్ వ్రాయాలనుకునే విద్యార్థులు ఆధార్ కార్డు, ఫోటో, పదవ తరగతి హాల్ టికెట్ తీసుకుని అగరాల వద్ద గల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నమోదు చేసుకోవచ్చన్నారు. ఓసి, బిసి విద్యార్థులకు దరఖాస్తు రుసుము రూ.400/-లు, ఎసీ , ఎస్టీ విద్యార్థులకు రూ.100/-లు మాత్రమే అన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 18 నుండి మే 9 వరకు పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత తరగతులు నిర్వహించబడతాయన్నారు.

## గిరిధర్‌నాయుడు నుండి మమ్మల్ని కాపాడండి

-జిల్లా ఎస్పీకి ఓ బాధితుడి వేడుకోలు

తిరుపతి ప్రెస్‌క్లబ్,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

'సిటీ మెయిల్' వారపత్రిక జర్నల

## గణనాధుని సేవలో మైక్రోస్మాల్ జాతీయ బోర్డు సభ్యుడు

కాణిపాకం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

మైక్రోస్మాల్ మరియు మీడియా ఎంటర్ ప్రైజెస్ జాతీయ బోర్డు సభ్యుడు రాజేష్ శర్మ ఆదివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. మంత్రి వెంట ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఐరాల తహశీల్దార్ సుశీల సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అడవిలో కార్చిచ్చు కల్లోలం

## అటవీ సంపద అగ్నికి ఆహుతి

గంగవరం,ఏప్రిల్ 16,ప్రభాతవార్త :

అసలే కరువుతో విలవిలలాడుతుంటే కర్చిచ్చుతో అటవీ సంపద అగ్నికి ఆహుతి అయిన సంఘటన బుధవారం మండలంలోని ఏడూరు,తాళ్ళపల్లె గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో చోటు చేసుకుంది.అటవీ ప్రాంతంలో కార్చిచ్చు దావానలంలా వ్యాపిస్తూ వేలాది ఎకరాల్లో అటవీ సంపదను దహించి వేస్తుంది ఇప్పటికే వందల ఎకరాల అటవీ సంపద అగ్నికి ఆహుతి అయిపోయింది.ప్రభుత్వం వందల కోట్లు ఖర్చుపెట్టి గ్రీనరీగా మార్చేందుకు భారీగానే చెట్లను పెంచింది.కానీ వాటిని సంరక్షించాల్సిన అధికారులు మాత్రం సంరక్షణను గాలికి వదిలేసారు. ఇటీవల కురిసిన వర్షాలకు దశాబ్దాల తరువాత దట్టమైన అటవీ ప్రాంతంగా మారింది.ఈ అటవీ ప్రాంతంలో కుందేళ్ళు,అడవి పందులు,నెమళ్ళతో పాటు ఎన్నో వన్య మృగాలకు ఆవాసంగా మారింది. ఇప్పటిదాకా దాదాపు 2000 ఎకరాల్లోని అటవీ సంపద అగ్నికి ఆహుతి అయింది.చుట్టుపక్కల గ్రామాలప్రజలు తీవ్ర భయాందోళనలకు గురి అవుతున్నారు.తాము ఆరుకాలం కష్టించి పండించిన పంటలు, పశువుల కోసం

అగ్నికి ఆహుతి అవుతున్న అడవి

ఏర్పాటు చేసుకున్న గడ్డివాములు అగ్నికి ఆహుతి అయిపోయాయని ఆవేదన చెందారు.క్షణలలో కన్నుల ఎదుటే కార్చిచ్చు దావానంలా వ్యాపిస్తున్నా స్థానికులు అరకొరగా మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది.ఆకతాయిల చేసిన వేల ఎకరాల అటవీ సంపద, వన్యప్రాణులు దహించి పోతున్నాయి.వేల ఎకరాలలో అటవీ సంపద,రైతుల పంటపొలాలు కార్చిచ్చులో కాలిపోతున్నా సంభందిత అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి మంటలు ఆర్పే చర్యలను తీసుకుంటున్న మంటలు అదుపులోకి రాలేదు.

## డిప్యూటి సిఎం మనవడిని ఆశీర్వదించిన మంత్రి రోజా

పుత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

పట్టణంలో ఆదివారం జరిగిన రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి మనవడి నామకరణోత్సవంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా పాల్గొన్నారు. డిప్యూటి సిఎం కుమార్తె ప్రతిభ, ప్రసాద్ దంపతుల కుమారుడికి నేహాన్ కార్తికేయన్ అని నామకరణం చేశారు. నేహాన్‌ను మంత్రి రోజా ఆశీర్వదించారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా.. యువకుడు దుర్మరణం

గుడుపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

పొలాల చదును చేసేందుకు కూలీపనికోసం వచ్చిన ఓ యువకుడిపై ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో యువకుడు మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండల కమ్మగుట్టపల్లి వద్ద గంగప్ప కుమారుడు రాజు (25) సుందరమ్మ, మునిరాజులకు చెందిన భూమిని చదును చేసే నిమిత్తం కూలీగా వచ్చాడు. ఈ నేపథ్యంలో ఎత్తు ప్రాంతంలో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా బ్రేక్ ఫెయిల్ కావడంతో మిట్ట ప్రాంతంనుంచి ట్రాక్టర్ వెనక్కు వచ్చి పది అడుగుల లోతులో కింద పనిచేస్తున్న రాజుపై బోల్తా పడింది. దీంతో రాజు మృతి చెందాడు. మృతుడు రాజుకు భార్య, ఓ చిన్నారి సంతానం. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రముఖ సినీనటుడు ఆలీకి సన్మానం

వెదురుకుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

ప్రముఖ తెలుగు సినీనటుడు ఆలీని ఆదివారం జడ్పీటీసీ సభ్యులు చలం పాళ్యం సుకుమార్ దుశాలువతో ఘనంగా సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. పుత్తూరులో ప్రముఖ తెలుగు సినీనటుడు ఆలీని మర్యాద పూర్వకంగా కలిసి పరిచయం చేసుకుని సన్మానం చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండాలని, ప్రభుత్వం చేపట్టుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళలని కోరిన్నట్లు చెప్పారు. సినీమాల్లో మీరు పండించే హాస్యంకు అందరు మీ అభిమానులేనని సుదీర్ఘంగా అటు సినిమాల్లోనూ, ఇటు రాజకీయాల్లోనూ రాణించాలని కోరుకున్నారు. ఆయనతో పాటు పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## అమ్మవారి వాహన సేవకు 'పులివర్తి సుధారెడ్డి'

చంద్రగిరి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి వాహన సేవకు టిడిపి నాయకురాలు పులివర్తి సుధా రెడ్డి హాజరయ్యారు. స్థానిక పాతపేటకు చెందిన కాపువీధి రాము, కాపువీధి యల్లయ్య, కాపువీధి సురేష్, కాపువీధి వెంకటేష్ అమ్మవారి అశ్వవాహన సేవకు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా తమ అభిమాన నాయకురాలు పులివర్తి సుధారెడ్డి చేతులమీదుగా అమ్మవారికి సారె అందజేయాలని ఆమెను ఆహ్వానించారు. సాయంత్రం ఆలయానికి చేరుకున్న ఆమెకు ఘన స్వాగతం పలికి సారెను అందజేశారు. అమ్మవారికి సారెను మోసుకుంటూ ఆలయ ప్రదక్షిణ గావించి ఆలయ అర్చకులకు అందజేశారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. తదుపరి అశ్వ వాహన సేవలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, టిడిపి గల్లా యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సక్కుర్ ధనంజయ రెడ్డి, మండలం లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## సేవారంగానికే యావదాస్తి ఇచ్చిన కందుకూరి

### -రాయలసీమరంగస్థలి నివాళులు

తిరుపతిసిటీ,ఏప్రిల్ 16ప్రభాతవార్త:

తనయావదాస్తిని సేవారంగానికే వినియోగించిన సేవా తత్పరుడు, పత్రికా సంపాదకుడు, నాటకరచయిత కందుకూరి వీరేశలింగం పంతులని రాయల సీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి తెలిపారు. ఆదివారం రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో నాటకరంగ దినోత్సవం సందర్భంగా పలువురు కళాకారులు విద్వాన్ కస్పాపద్మనాభన్, జిఎన్ కోటేశ్వరరావు, మేకల గంగయ్య, భాస్కర్ కళాకారులకు వీరేశలింగం పంతులు పురస్కారాలను అందజేశారు. రంగస్థలి కళాకారులు కెఎన్ రాజ,కొత్తపల్లి శంకరయ్య, పొన్నాల జేజిరెడ్డి, వెంకటరామయ్య, సిద్దేంద్రశర్మ, సుబ్రమణ్యంరెడ్డిలు పాల్గొన్ని దుశ్శాలువలతో సన్మానించారు.

## అగ్ని ప్రమాదాలపై వాలంటీర్లకు అవగాహన

తొట్టంబేడు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

అన్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణానికి సమీపంలోని కాసాగార్డెన్ సమీపంలోని విస్తరణ శిక్షణ కేంద్రంలో ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణా కార్యక్రమంలో ఉన్న వారికి అగ్నిమాపకశా ఖాధికా రులు గ్యాస్‌లీకేజీ అయినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇక్కడ శిక్షణ పొందుతున వాలంటీర్లు మరియ ఆశావర్కర్లు, ఆపదమిత్ర వాలంటీర్లుకు గ్యాస్, ఆయిల్ పైర్స్ మరియు విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ మరియు ఆపదలో ఉన్న వారిని ఏవిధంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి అని డెమో ద్వారా వివరించారు. కాగా తొట్టంబేడు మండలంలోని చెంచులక్ష్మి కాలనీలో ఉన్న ప్రజలకు గ్యాస్ మంటలు చెలరేగినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఈసిటి శిక్షణ కేంద్రం సిబ్బంది, చెంచులక్ష్మి కాలనీ వాసులు మరియు సీనియర్ లీడింగ్ ఫైర్‌మ్యాన్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి వసతి దీవెన కార్యక్రమం రద్దు

చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా సింగనమల నుండి సోమవారం నిర్వహించనున్న జగనన్న వసతి దీవెన కార్యక్రమం రద్దు అయినట్లు కలెక్టర్ సగిలి షన్మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. సిఎం కార్యక్రమం రద్దు కావడంతో జిల్లా స్థాయిలో వర్చువల్ విధానంలో కలెక్టరేట్‌లో జరిగే జగనన్న వసతి దీవెన కార్యక్రమం రద్దు అయ్యిందని ఆయన పేర్కొన్నారు.

## మాజీ మంత్రి సమక్షంలో పలువురు టిడిపిలో చేరిక

పలమనేరు ఏప్రిల్ 16 ప్రభాతవార్త :

పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన పలువురు వైకాపా నేతలు మాజీ మంత్రి ఎన్.అమర్నాథ్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు.పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పూతల పట్టు మండల టిడిపి నాయకుల ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ ఊట్లాల నాగరాజు నాయుడు,వైకాపా నేతలు చెంగల్ రాయులు,చిరంజీవి,వెంకట కృష్ణయ్య,నారాయణ స్వామి,కళ్యాణ్,విజయ్‌కాంత్‌లు తెలుగుదేశం పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పార్టీలో చేరిన వారికి కండువాలను వేసి టిడిపిలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పూతల పట్టు మండల తెదేపా అధ్యక్షులు దొరబాబు చౌదరి,పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి గంగారపు గోపి,డిసిసిబి మాజీ చైర్మన్ కాంతారావు,తెదేపా రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ఆనగల్లు మునిరత్నం,మాజీ సింగిల్‌విండో చైర్మన్ ఇంద్రసేన నాయుడు,మండల తెదేపా ప్రదాన కార్యదర్శి హేమాద్రి,యు.పి,టి.సి బాలకృష్ణ నాయుడు,సర్పంచ్ జయచంద్ర,యూనిట్ ఇంచార్జిలు రెడ్డెప్ప నాయుడు,జగన్నాథ్, నాగయ్య,సుబ్బరాజు,హరి,దాము,ఏకాంబరం,హరిబాబు,సురేంద్రబాబు,రవి నాయుడు,యువరాజు నాయుడు,మోహన్ నాయుడు,నటరాజు నాయుడు,మధు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో తెలుగుదేశం సత్తా చాటుదాం

### - నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి

### - యువత కమిటీల ప్రమాణస్వీకారం

కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

2024 అసెంబ్లీ ఎన్నికల్లో కుప్పం నియోజకవర్గంలో యువత కలసికట్టుగా పనిచేసి తెలుదేశం పార్టీ సత్తా చాటుదామని నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో తెలుగుయువత కమిటీల ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెదేపా అధినేత చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ల ఆశీస్సులతో కుప్పంలో యువతకు కీలక బాధ్యతలు అప్పగించారని తమపై వారు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయమన్నారు. వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో అధినేత చంద్రబాబుకు భారీ మెజార్టీ సాధనకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు. పార్టీలో సీనియర్ల సలహాలతో ముందుకు సాగుతామన్నారు. యువతకు అండగా నారా లోకేష్ నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నూతన కమిటీ కార్యవర్గాలను నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం , పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, రాష్ట్ర నేత గోపీనాథ్, నేతలు ప్రేమ్‌కుమార్, సాంబశివం, విశ్వనాథనాయుడు, సత్యేంద్రశేఖర్, కాణిపాకం వెంకటేష్, మురళి, ప్రతాప్, సంతోష్, బాలాజీ, నరేష్, వసంతమ్మ, చంద్రకళ, సుబ్బు, పార్థసారథి, నాలుగు మండలాల నేతలు పాల్గొన్నారు.

## దేవస్థానం సత్రాలలో పనిచేయని సెల్‌ఫోన్లు

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయం లోబావిలో ఏర్పాటు చేసిన అతిధి గృహాల వద్ద సెల్‌ఫోన్లు పని చేయక యాత్రికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ సమస్య సుమారు ఆరునెలలుగా దేవస్థానం అధికారులు, పాలకుల దృష్టికి తెస్తుంటే పట్టించుకోవటం లేదు. దాంతో ఇక్కడి అతిధి గృహాల్లో చేరటానికి యాత్రికులు ముందుకు రావటం లేదు.కోట్లు కుమ్మరించి నిర్మించిన 125గదుల సత్రాలు,కోట్లు కుమ్మరించి నిర్మించిన టిటిడి డార్మెంటరీల్లో చేరటానికి భక్తులు సుముఖత చూపటం లేదు.దాంతో బస అవకాశం ఉన్నా పట్టించుకునే దిక్కులేదన్నారు. ఊరికి దూరంగా ఎలాంటి సదుపాయాలు లేని అతిధి గృహాలకు కోట్లతో సిమెంటు రోడ్లు సింగారాలు చేసారు.కానీ ఇక్కడచుట్టూ కొండలు ఉండటంతో సెల్‌ఫోన్లుపని చేయటం లేదు.దీనికి తోడు ఇక్కడ గదులకు గీసర్‌లు ఏర్పాటు చేయలేదు. గదులను ప్రారంభించిన దేవస్థానం తరువాత ఇక్కడ మౌళిక సదుపాయాలు గురించి పట్టించుకోలేదు.దాంతో ఇక్కడ చేరిన వారికి ఎదైనా అవసరంఅయినా ఇబ్బందిగా మారింది. ఇక్కడ సెల్‌ఫోన్లు పని చేయాలంటే సెల్ టవర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ దేవస్థానం అధికారులు పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెల్‌ఫోన్లు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## డయల్ యువర్ కమిషనర్, స్పందనను సద్వినియోగం చేసుకోండి

### కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, ఏప్రిల్ 16,ప్రభాతవార్త

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం 17వ తేది ఉదయం 10 నుండి 11 వరకు డయల్‌యువర్ కమిషనర్ కార్య క్రమం, 11 నుండి 12 గంటల వరకు నేరుగా అర్జీలు, పిర్యాదులు స్వీకరించే స్పందన కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. 0877-2227208 నంబర్‌కి కాల్ చేసి తమ ఫిర్యాదులు తెలియజేయవచ్చు అని నేరుగా వచ్చి అర్జీలు, ఫిర్యాదులు ఇవ్వవచ్చన్నారు.

## మహిళను కాపాడిన కానిస్టేబుల్

శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త

ఆత్మహత్యకు పాల్పడుతున్న మహిళను కాపాడిన కానిస్టేబుల్ అనిల్‌కుమార్

శ్రీకాళహస్తి పట్టణంలోని అభివృద్ధి చెందుతున్న శాంతినగర్‌లో ఓ మహిళ తన చంటిబిడ్డతో కలసి కుటుంబ కలహాలకారణంగా ఆత్మహత్యకు పాల్పడుతుండగా బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ టిజిఆర్ అనిల్‌కుమార్ గమనించి కాపాడిన ఉదంతం వెలుగుచూసింది.శాంతి నగర్‌కు చెందిన రచన ప్రేమ వివాహం చేసుకుంది. అయితే వారి కాపురం కొంత సకాలంగా సాగింది. వారి ప్రేమకు గుర్తుగా ఓ చిన్నారిపుట్టింది. అయితేవారి ప్రేమ వ్యవహారం చాలాకాలం సాగలేదు. ఇద్దరిమధ్య మనస్పర్థలు చేసుకున్నాయి. తరచూ భర్త వేధించేవాడని వెళ్ళి ఎక్కడైనా వెళ్ళి చావమని భార్త కోపపడ్డారని తెలిసింది. దాంతో మనస్థాపం చెందిన రచన ఆత్మహత్యకు చంటిబిడ్డను ఎత్తుకొని వెళు తుండగా ఆదారిన వెళుతున్నకానిస్టేబుల్ అనిల్‌కుమార్ గమనించి వారించారు. వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కుటుంబంలో కలహాలుంటే పోలీసుస్టేషన్‌కు వెళ్ళి పరిష్కరించుకోవాలని సూచించారు. రచనను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఎస్సీ పరమేశ్వరరెడ్డి విషయం తెలుసుకుని కానిస్టేబుల్ అనిల్‌కుమార్‌ను అభినందించారు.

## పింఛను కోసం వృద్ధురాలు ఎదురుచూపు

### - స్పందనకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం..

కిట్టమ్మ

కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా అర్హులకు వైఎస్సార్ పెన్షన్ కానుక పథకాన్ని అమలు చేస్తోంది. అయితే తగిన అర్హత ఉండి దరఖాస్తు చేసుకుని పింఛను వస్తుందని ఎదురుచూస్తున్న వృద్ధురాలికి ఏడాదిన్నర గడచినా పెన్షన్ మంజూరు కాలేదు. స్పందన కార్యక్రమంకు దరఖాస్తు చేసుకున్నా అన్ని అర్హతలు ఉన్నాయి మీకు పెన్షన్ వస్తుంది అని చెప్పారే గానీ పెన్షన్ మంజూరు కాలేదు. దీంతో ఆ వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. గుడుపల్లె మండలం పిబి వాడకు చెందిన గోపాలప్ప భార్య కిట్టమ్మ (70) తన భర్త 28-8-2021న మృతి చెందారు. అనంతరం తనకు వృద్ధాప్య పింఛను కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే ఇక్కడే పెన్షన్ మంజూరుకు వాలంటీరు, స్థానిక నేతలు తిరకాసు పెట్టారు. ఆమెకు ఏడాదిన్నర గడచినా పెన్షన్ మంజూరు కాలేదు. తీరా ఈ విషయంగా ఆరా తీస్తే కిట్టమ్మ కుమారుడు కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పనిచేస్తాడనే కారణంతోనే పెన్షన్ మంజూరు చేయలేదని తెలిసింది. దళిత కుటుంబానికి చెందిన కిట్టమ్మకు అన్ని అర్హతలు ఉన్నా ఎందుకు పెన్షన్ మంజూరు చేయడంలేదో అధికార పార్టీ నేతలకే ఎరుక. ఈ విషయంగా ఆదివారం తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సైతం జిల్లా కలెక్టరుకు లేఖరాశారు అంటే పరిస్థితి ఊహించుకోవచ్చు. జిల్లా ఉన్నతాధికారులు అర్హత కలిగిన కిట్టమ్మకు పెన్షన్ మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడుదాం

### - పట్టభద్రుల ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్

గుడుపల్లె, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైకాపా అరాచక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సహకరించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ కోరారు. ఆదివారం గుడుపల్లెలో జరిగిన తెదేపా నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టభద్రుల ఎన్నికల్లో వైకాపా దొంగ ఓట్లతో గెలవాలని చూసినా పట్టభద్రులు తెదేపాకు పట్టం కట్టి తనను గెలిపించారన్నారు. ఇదే స్ఫూర్తితో కుప్పంలో అధినేత చంద్రబాబునాయుడుకు లక్ష మెజార్టీసాధించుటకు నేతలు, కార్యకర్త పనిచేయాలని కోరారు. రాష్ట్ర భవిష్యత్తు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యకర్తలకు తాము అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా, చంద్రబాబు కార్యదర్శి మనోహర్, మండల పార్టీ అధ్యక్షుడు బాబునాయుడు, నేతలు చంద్రశేఖర్, మునిరాజు, బేటప్పనాయుడు, హేమాంబర గౌడు, తిరుపతి, ఎస్ఆర్ చంద్ర, డా॥ వెంకటేష్, ఎల్లప్ప, జయరాంనాయుడు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

### -తిరుపతి జిల్లా కార్యవర్గ ఎంపికలో రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి. సుబ్బారావు

తిరుపతిరూరల్, ఏప్రిల్16 ప్రభాతవార్త:

జర్నలిస్టుల స్వేచ్ఛ హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేసారు. ఆదివారం బైరాగిపట్టేడలోని గంధమనేని శివయ్య భవనంలో ఏపియుడబ్ల్యుజె తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం ఎంపికలో ఆయన ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ యూనియన్‌కు రాజకీయాలతో పని లేదని, జర్నలిస్టుల సంక్షేమం వారి హక్కుల పరిరక్షణే ధ్యేయంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గం పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర ప్రధాన కార్యధర్శి చందు జనార్ధన్, కార్యధర్శి రామసుబ్బారెడ్డి, జయప్రకాష్,కార్యవర్గసభ్యులుడాక్టర్ఎం.ప్రసాద్, జాతీయ కౌన్సిల్ సభ్యులు మురళి, రామాంజ నేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఏపియుడబ్ల్యుజె తిరుపతి జిల్లా నూతన కార్యవర్గం**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షుడుగా డాక్టర్ ప్రసాదరెడ్డి, ప్రధాన కార్యధర్శిగా పి.నరేంద్ర, ఉపాధ్యక్షులుగా ఎం.ఎస్.రెడ్డి, సుబ్రమణ్యం, శీనుబాబు,, శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యధర్శిగా మబ్బు నారాయణరెడ్డి, సహాయ కార్యధర్శులుగా పెద్దిరెడ్డి నరసింహారెడ్డి, తారక్, జోసప్, కోటేశ్వరబాబు, పద్మనాభం, కోశాధికారిగా చంద్రబాబు, కార్యవర్గసభ్యులుగా మునిరామిరెడ్డి, రాధాకృష్ణ, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, కిరణ్‌కుమార్, రాజు, భరత్‌రెడ్డి, ఎస్.రాజు, శ్రీరాజు, బాలయ్య, ఈశ్వర్, చంద్రశేఖర్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎంపికలో ఎన్నికల అధికారిగా కృష్ణయ్య, రాష్ట్ర ఎన్నికల పరిశీలకులుగా రామసుబ్బారెడ్డిలు తెలిపారు.

# బిసిల పక్షపాతి జగనన్నకు తిరుగులేదు

## ఆత్మీయసభలో సిపాయి

శ్రీకాళహస్తిరూరల్, ఏప్రిల్ 16 ప్రభాతవార్త

'రజకులకు సబ్బుబిళ్ల, నాయిబ్రాహ్మణులకు అద్దం ఇవ్వటమే అభివృద్ధిగా ' చెప్పటమే తెలుగుదేశం బిసిలకు ఇచ్చిన వరమని నేడు లక్షల కోట్లు బిసిలకు అందిస్తున్న జగనన్నకు రాబోవు రోజుల్లో తిరుగులేదని ఆదివారం ఏర్పేడుమండలం పల్లంలో జరిగిన ఆత్మీయ సభలో ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం అన్నారు.బిసిల పట్ల తెలుగుదేశం గొప్పలు చెప్పుకోటం తప్ప చేసింది ఏమి లేదన్నారు. నేడు నవరత్నాలను చూసి తెలుగుదేశంపార్టీకి ముచ్చెమటలు పడుతున్నాయన్నారు.ఒక్కొక్క బిసి కుటుంబానికి నేడు 5 సంవత్సరాల్లో జగనన్న ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా రూ.లక్షా 25వేలు ఆర్థిక సహాయం అందించారని వివరించారు. గతంలో ఏ పథకం పొందాలన్నా పచ్చ చొక్కాల జాలి అవసరమన్నారు.కానీ నేడు బ్రోకర్లు,కమిషన్లు లేకుండా ప్రజల ఖాతాల్లో వేసిన ఘనత ప్రపంచ చరిత్రలో ఒక్క జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. కాబట్టి నేడు జనం జగనన్నను గుండెల్లోపెట్టుకొని ఆరాధిస్తున్నారని సిసాయి సుబ్రమణ్యం అన్నారు.ఈ సభలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మాట్లాడుతూ జగనన్న బిసిలకు పరిపాలనలో అగ్రభాగం అందించారన్నారు.రాబోవు ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్ని కుతంత్రాలు చేసిన ప్రజలను రెచ్చగొట్టినా వెరవరని మధుసూధనరెడ్డి వివరించారు.

**పార్టీలో చేరిక:**

ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో పలువురు కరడుగట్టిన తెలుగుదేశం కార్యకర్తలు వైకాపా పార్టీలో చేరారు.మండల తెలుగుదేశం అధ్యక్షులు డాక్టర్ వెంకట్రాది, ఉపాధ్యక్షుడు డాక్టర్ దాము

తెలుగుదేశం పార్టీ చింతలపాళెం నాయకులు భీమవరంపెంచులయ్య,కోల్టేటి దేశయ్య,నరసయ్య, మస్తాన్, వాగవీడు గ్రామానికి చెందిన పి.సుబ్బరత్నం అంకయ్య,చింతల చిన్నయ్య పల్లం గ్రామానికి చెందిన పి.రఘూరామనాయుడు వెంకటేశ్వర్లు,గంగలపూడి కి చెందిన వెంకటేశ్వర్లు,గంగలపూడికి చెందిన సురేష్,భాను జానకి రామ్, శ్రీనివాసులు,నరేష్ తదితరులు తెలుగుదేశం పార్టీకి రాజీనాయచేసి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చొరవతో ఎంఎల్ఏ సమక్షంలో వైకాపా సభ్యత్వాన్ని తీసుకున్నారు